# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ముఖ (పరిచయం) పుస్తకం

మంచు దుప్పటి కప్పుకున్నట్టుగా చల్లగా, తెల్లగా మెరుస్తోంది ఓస్లో నగరం, నార్వే దేశపు రాజధాని. సిటీ సెంటర్ కి కాస్త దూరంలో ఉన్న ఓ అపార్ట్మెంట్ కాంప్లెక్స్ లో తన చిన్న, సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ లో ఒంటరిగా కూర్చుని ఉంది స్వాతి. బయట ఎముకలు కొరికేసేస్తున్నట్టున్న చలి, ఆగకుండా పడుతున్న మంచు, కాలు బయటపెట్టాలంటే కష్టంగా ఉంది, మూడు కోట్లు, స్నో బూట్లూ వేసుకుని బయటకు వెళ్దామని చూసింది కానీ రివ్వున కొట్టిన చల్లటిగాలికి అసలే జలుబుగా ఉండడం చేత ముక్కంతా పట్టేసింది.

"ఇలాంటి చలిలో తిరిగితే ఇంకా ఏమవుతుందో? మళ్ళీ ఈ చలిలో డాక్టర్ దగ్గరకి వెళ్ళాలంటే అదో పెద్ద బాధ, అసలే ఇంకా ఏమీ సరిగా తెలీదు తనకి ఇక్కడ" అనుకుంది.

టీ. వీ పెట్టి ఆపేసింది, ఒక్క ప్రోగ్రాం కూడా నచ్చింది కనబడలేదు, ఈ రోజెందుకో మరీ చలిగా ఉండి, అసలు సూర్యుడే కనిపించకపోవడం వల్ల చాలా చిరాగ్గా ఉంది స్వాతికి. ' పేరుకే లాండ్ ఆఫ్ మిడ్ నైట్ సన్', తను వచ్చినప్పటినించీ అసలు మిడ్ నైట్ లో కాదు కదా పట్టపగలు కూడా సూర్యుడే లేడు. రోజూ ఎండ అలవాటయిన తనకి ఇది ఎంత చిరాకో మాటల్లో చెప్పలేదు, ఆఫీసులో ఉంటే తెలీదు కానీ, ఇంటికివచ్చినప్పటినించీ, ఎప్పుడె ప్పుడు తెల్లారుతుందా? అని ఎదురుచూడడమే సరిపోతుంది.

"అనవసరంగా వచ్చాను ఈ ఆన్ సైట్ ప్రాజెక్ట్ కి, ఇక్కడ ఒక్కదానికీ పిచ్చెక్కిపోతోంది" ఇది వందోసారి అనుకోవడం. "ఆన్ సైట్ అనగానే అందరూ అమెరికాయో, లండనో వెళతారు అంతే కానీ ఇలా ఓ,చలి పీకేసే నార్వేలూ, అలాస్కాలు అనగానే ఒప్పేసుకోరు. అప్పుడే మేనేజర్ కి చెప్పి ఉండాల్సింది, నాకు కుదరదు అని, ఇప్పుడనుకుని ఏం లాభం, శాలరీ బావుంటుంది స్వాతీ, నీకెప్పటినించో ఆన్ సైట్ అంటే చాలా ఇష్టం కదా అని అతను అనడమేమిటి? తను ఒప్పేసుకోవడమేమిటి? " అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి, అదంతా ఇప్పటికీ కలలోలా ఉంది.

అసలు వీటన్నింటికీ కారణం పెద్దమ్మ కొడుకు కిరణ్ అన్న, వాడు ఇంజనీరింగ్ లో ఐ.టీ తీసుకుని, కాంపస్ సెలక్షన్స్ లో ఉద్యోగం సంపాదించిన ఆరు నెలల్లోనే లాంగ్ టర్మ్ లో ప్రాజెక్ట్ పని మీద ఆన్ సైట్ అంటూ అమెరికా వెళ్లేసరికి కుటుంబంలో వాడో పెద్ద హీరో అయిపోయాడు. వాడిని ప్రేరణగా తీసుకుని ఫేమిలీలో అందరూ ఎడా, పెడా కంప్యూటర్ ఇంజనీర్లు అయిపోయారు తనతో సహా. " ఈ సారి కలిసినప్పుడు వాడిని కొడతాను చూడు" అనుకుంది మనసులో కోపంగా, అక్కడికి తప్పంతా అతనిదే అయినట్టు.

" ఉద్యోగం రావడమేమిటి? తనని విమానమెక్కించి ఆన్ సైట్ అంటూ ఏ అమెరికానో, లండనో పంపిచేస్తారు, ఇంకేమిటి? కిరణ్ అన్నయ్యలాగే తనూనూ" అని కలలు కనడం మొదలు పెట్టింది. అంతే కాదు అదో పెద్ద ఆశయం అయిపోయింది తనకు. కాంపస్ లో వచ్చిన ఉద్యోగం లో మొదటి ఆరునెలలు ట్రైనింగ్ అన్నారు, 'ఈ శిక్షణ అయ్యాకా మనల్ని ప్రాజెక్ట్ లో పెడతారు' అంది తోటి స్నేహితురాలు.

"ఓకే, ఆరు నెలలైనా ఇంకా శిక్షణా, అదీ అంటున్నారు కానీ ఇంకా మనల్ని అమెరికా పంపించడం లేదేమిటా? అనుకున్నాను, ప్రాజెక్ట్ అలాట్ చేశాకా జరుగుతుంది" అని సంబరపడింది. కానీ ఆమె కోరిక తీరలేదు. ప్రాజెక్ట్ పని మొదలయింది, పని నేర్చుకుంటోంది కానీ, ఇంకా ఎవరూ ఆన్ సైట్ గురించి మాటాడరేమిటా?" అని రోజూ నిరాశ పడేది. అంతే కాదు, ఆఫీస్ పని మీద అమెరికా, అదీ వెళ్ళి వచ్చినవాళ్ళు చాక్లెట్లూ అవీ టీము అందరికీ తెచ్చినప్పుడు తనెప్పుడు అలా తెస్తుందా? అని అనుకునేది.

మొదట్లో ప్రతీ నెలా వెళ్ళి మేనేజర్ ని అడిగేది, తనకి ఆన్ సైట్ మీద బయటకి వెళ్ళడం ఎంత ఇష్టమో, అది తనకి ఎప్పటినించో ఎదురు చూస్తున్న కల అని చెప్పేది. వందలాది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు అదే ఆశతో ఉద్యోగంలో చేరతారు, అందులో పెద్ద వింతేమీ

లేదు ఆమె మేనేజర్ కి. అందుకే ముందు అతను విని ఊరుకున్నాడు, కానీ ఆమె తర్వాత ప్రతీ వారమూ చెప్పడం మొదలు పెట్టింది. ఇంచుమించు అతని చెవిలో ఇల్లు కట్టుకుని పోరినట్టే ప్రవర్తించేది.

ఒకరోజు ఆయన విసిగి పోయి " చూడు స్వాతి, నువ్వు ఇన్నిసార్లు చెప్పక్కరలేదు, అవకాశం వచ్చినప్పుడు, బాగా పనిచేశేవాళ్ళనీ, కావలసిన అర్హతలున్నవారినీ మేమే ఎంపిక చేసి పంపిస్తాము, అంతవరకూ మీరందరూ చెయ్యాలసిందల్లా, బాగా పని నేర్చుకుంటూ, శ్రద్ధగా పని చెయ్యడమే, అలా అయితేనే సరి అయిన అవకాశం వచ్చినప్పుడు అందరికంటే ముందుంటావు" అని చెప్పాడు.

"అమ్మా, నాకు తొందరలోనే ఆన్ సైట్ రావాలని ప్రార్థించు, పూజ చెయ్యి" అని గొడవ చేసేది. అలా దాదాపు రెండేళ్ళు గడిచిపోయింది. మేనేజర్ చెప్పిన మాటలు గుర్తుంచుకుని చాలా శ్రద్ధగా పనిచేసేది, దాంతో ఆమె అందరి దృష్టిలో పడసాగింది, చురుగ్గా ఉంటూ చక్కగా పని చేస్తూ మంచి టీం ప్లేయర్ అనిపించుకుంది. తను అన్నీ ఇంత బాగా చేస్తున్నా కానీ ఇంకా ఆన్ సైట్ రాకపోవడం ఆమెకి చాలా బాధగా ఉంది, నిజానికి ఆమె పనిచేస్తున్న ప్రాజెక్ట్ కి ఆన్ సైట్ వెళ్ళే అవసరం లేదు, అలా అంటే పిల్లలు సరిగ్గా పని చెయ్యరని ఆ విషయం చెప్పరు, మేనేజర్లు. కానీ స్వాతి పట్టుదల చూసి అతను ఆమె అతనికి హెల్ప్ చెయ్యాలన్న ఉద్దేశ్యంతో తన ఫ్రెండ్ యొక్క ప్రాజెక్ట్ లోకి ఆమెని నార్వే ఆన్ సైట్ కి పంపిద్దామని అనుకుని ఆమెతో చెప్పారు. అంతే, బయటకి వెళ్ళడమే ధ్యేయంగా ఉద్యోగం చేస్తున్న స్వాతి మరేమీ ఆలోచించకుండా వెంటనే ఎగిరి గంతేసి ఒప్పేసుకుంది.

"నీకు ఆన్ సైట్ మీదున్న ఇష్టాన్ని చూసి, నువ్వు రెండేళ్ళనించీ బాగా పని చెయ్యడం చూసి ఈ అవకాశం ఇద్దామని అనుకున్నాము, ఇది మన ప్రాజెక్ట్ లో కాదు, మరొక రెండు నెలలు ఆ ప్రాజెక్ట్ పని నేర్చుకుంటే, ఈ లోపున నీ పాస్ పోర్ట్, వీసా పనులు పూర్తి అవుతాయి, అప్పుడు నువ్వు వెళ్ళవచ్చు"అని మేనేజర్ చెప్పిన రోజు ఆనందంతో నిద్ర పట్టలేదు స్వాతికి.

" నార్డిక్ దేశాలు, ఖరీదు లూ, చలి రెండూ ఎక్కువే రా తల్లీ" అని నాన్న చెప్పినా సరే,

" ఖరీదులు కనకే జీతం ఎక్కువ ఇస్తున్నారు కదా నాన్నా, నేనేమీ పది, పదిహేనేళ్ళు ఉండను కదా, ఒక ఏడాది లేదా ఏడాదిన్నర అంతే కదా, ఒక్కదాన్నే ఉంటాను కదా, బోలెడు డబ్బులు కూడా మిగులుతాయి" అని ఆయన్ని ఒప్పించి వచ్చింది.

"నీ పిచ్చి మండిపోనూ, కావాలంటే పెళ్ళి చేసి అమెరికా పంపుతాము, ఒక్కదానివీ ఎందుకే? ఎలా ఉంటావు అక్కడ?" అంది అమ్మ దిగులుగా.

"పెళ్ళి చేసుకుని వెళ్ళడమేం గొప్ప అమ్మా? నా అంతట నేను వెళ్ళడం గొప్ప కానీ, నార్వే చాలా సేఫ్ కంట్రీ అమ్మా, నువ్వేమీ భయపడకు" అంది

ఇక్కడకొచ్చిన కొత్తలో అంతగా ఏం అనిపించలేదు. అంతా సరదాగా ఉండేది. ఆఫీస్ లో కూడా ఎనిమిదింటినించీ నాలుగింటిదాకానే పని. ఇక్కడివాళ్ళు ఫామిలీకి చాలా ప్రాముఖ్యత ఇస్తారు, అందుకే మరీ ఎక్కువ ముఖ్యమైన పని ఉంటే తప్ప నాలుగు తర్వాత ఎవరూ కనిపించరు. పిల్లలున్న వారు మూడు, మూడున్నరకే వెళ్ళిపోవచ్చు కూడా, వాళ్ళని డే కేర్ సెంటర్ల నించీ, స్కూళ్ళనించీ తీసుకురావడానికి వీలుగా ఉంటుందని.

మొదట్లో చలి, మంచు కూడా సరదాగానే ఉండేది, కానీ రోజులు గడిచే కొద్దీ విసుగు రావడం మొదలయింది. " ఇంత చలిలో, మంచులో ఎలా బ్రతుకుతారో?" అని విసుక్కునేది. ఇళ్ళు చాలా ఖరీదు కావడం వల్ల అతి కష్టం మీద తను కోరుకున్న అద్దెలో దొరికింది ఈ చిన్న ఫ్లాట్. ముందు తనకొక్కదానికి చాల్లే అనుకుంది కానీ, తర్వాత అదీ ఇబ్బందిగానే ఉంది ఆమెకి. తనకి కార్ లేకపోవడం వల్ల, ఎక్కడికైనా వెళ్ళాలంటే చలిని తట్టుకుంటూ వెళ్ళడం మరొక ఇబ్బంది.

ఆఫీస్ లో అందరూ సరదాగానే ఉంటారు, అయితే అది అక్కడవరకే, ఇంటికొస్తే తనొక్కర్తే. తనుండే అపార్ట్మెంట్ లో ఇంటర్నెట్ కూడా పూర్తిగా ఉచితం కాదు, దానితో లెక్క చూసుకుని మరీ ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ఈ క్రిస్మస్ పుణ్యామా అని నాలుగురోజులనించీ ఎవరూ ఆఫీస్ లో లేరు, ఊరంతా లైట్లూ, క్రిస్మస్ నక్షత్రాలూ, మార్కెట్ లలో చిన్నవీ, పెద్దవీ క్రిస్మస్ చెట్లూ, అవన్నీ ఎంతో బావున్నాయి కానీ ఈ సారి ప్రతీసారికంటే ఎక్కువగా ఉంది చలి, దానికి తోడు సెలవురోజుల్లో తక్కువగా ఉండే బస్సులూ, ట్రాములూ, ఎక్కడికైనా వెళ్ళాలంటే మరింత కష్టతరం చేస్తున్నాయి.

మామూలుగా అయితే చార్జ్ చేస్తారు, కానీ ఈ సెలవుల్లో ఫ్రీగా వాడుకోమన్నారు ఇంటర్నెట్ ని, అదొక్కటి తనకు కలిసి వచ్చింది అనుకుంది స్వాతి. కానీ ఎంతసేపు చూస్తుంది నెట్ మాత్రం? మొదట పదిహేనురోజులూ కంపెనీ గెస్ట్ హౌస్ లో ఉండి, ఈ అపార్ట్మెంట్ లోకి మారి నెల అవుతోంది, ఇంకా ఎవరూ పెద్దగా పరిచయం అవలేదు, తనకి. కాసేపు ఫేస్ టైములో అమ్మా, నాన్నలతో మాట్లాడింది.

వదినా, అన్నయ్య- వదినా వాళ్ళింటికి వెళ్ళారుట చెన్నై. అమ్మా వాళ్ళు కూడా రేపు బయలుదేరి ముందు చెన్నై వెళ్ళి అక్కడనించి అందరూ కలిసి తిరుపతి వెళతారుట.

"నువ్వు లేవే చిన్నారి బంగారం ఈ సారి, మనం ప్రతీ ఏడాది కొత్తసంవత్సరం టైముకి వెళ్ళే తిరుపతి యాత్రకి" అని అమ్మ అనగానే స్వాతికి గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఈసారి వదినా వాళ్ళ అమ్మా, నాన్నా కూడా వస్తారు మనతో, చాలా సరదా అయినవాళ్ళు అని అమ్మ మామూలుగా చెప్పుకుపోతోంది. ఇవాళ మీ డేడీ పుట్టినరోజని పొద్దున్నే పులిహోర చేశాను, చాలా బాగా వచ్చింది, ఈ సారి నువ్వులూ, ఎండుకొబ్బరీ పొడి చేసి కలిపాను అందులో అని అమ్మ చెప్తూ ఉంటే జివ్వున ఊరాయి నోట్లో నీళ్ళు.

"అబ్బా, అమ్మా, ఇంక చెప్పకు, నోరూరుతోంది" అంది.

" నీకక్కడంతా బావుందా? ఒక్కర్తివీ ఎక్కడికీ వెళ్ళకు. చలి బాగా ఉందన్నావు, జాగ్రత్త, జలుబుచేసి తల దిమ్మవుతుంది, వైరల్ ఇంఫెక్షన్ వస్తే తొందరగా తగ్గదు, వేడిగా ఏదైనా తాగుతూ ఉండు. తలుపులన్నీ జాగ్రత్తగా వేసుకో, వేళకి తింటూ ఉండు, కంటి నిండా నిద్ర పో, దేశం కాని దేశంలో ఉన్నావు. ముక్కూ, మొహం తెలియని వాళ్ళతో పరిచయాలు పెట్టుకోకు, ముఖ్యంగా ఆ ఫేస్ బుక్ తో జాగ్రత్త, మంచి మంచి ఫోటోలు పెట్టకు, ఒకవేళ పెట్టినా ఆఫీస్ వాళ్ళందరితోనూ కలిసి ఉన్నవి పెట్టు, నీ ఒక్కదానిదీ పెట్టకు " అని ఇంకా ఏదో చెప్తూనే ఉన్న అమ్మని మధ్యలోనే ఆపి.

"అబ్బా, అమ్మా! మళ్ళీ మొదలు పెట్టావా? టెక్నాలజీ అనేది వాడుకోవడానికే ఉంది, మన జాగ్రత్తలో మనం ఉంటూ, వాడుకుంటే ఏం పరవాలేదు అని ఎన్ని సార్లు చెప్పానమ్మా, అయినా వినవు కదా " అని విసుక్కుంది.

" ఏం ఉద్యోగాలురా, బంగారం, నేనూ మీ నాన్నా నిన్ను తలుచుకోని క్షణం లేదనుకో, మీ నాన్నైతే మరీనూ"

ఎదురుగా నిలబడి ఉన్నట్టు చెప్తుంది అమ్మ కబుర్లు. అవి వింటూ, అమ్మని చూస్తూ ఉంటే ఒక పక్కన ఒంటరితనపు దిగులు తగ్గినట్టనిపించినా, మరోపక్క తను అక్కడ లేక ఎంత మిస్ అవుతోందో తలుచుకుంటే మనసంతా దిగులుతో నిండిపోయి, కళ్ళ నీళ్ళు అప్రయత్నంగానే తిరిగేవి. అవి అమ్మకి చూపించకూడదనే పట్టుదలతో బింకంగా ఉండేది, ఫోన్ పెట్టేశాకా అప్పుడప్పుడూ తనకి తెలియకుండానే ఏడుపు వచ్చేశేది. ఈ స్కైప్ లూ, ఫేస్ టైం లు వచ్చాకా కొంత నయం, ఇదివరకంత బాధ పడక్కరలేదు.

" అమ్మా మీకు రాత్రవుతోంది కదా, పడుకో, మళ్ళీ పొద్దున్నే ప్రయాణం అన్నావు, తొందరగా పడుకో, రేపో, ఎల్లుండో మళ్ళీ ఫోన్ చేస్తానులే" అని పెట్టేసింది.

" హాయ్, మీకు అభ్యంతరం లేకపోతే 'ఓస్లో' లో మీరు ఎక్కడ ఉంటున్నారో చెప్తారా? " ఫేస్ బుక్ లో వచ్చిన మెసేజ్. అవతల వ్యక్తి పేరు అభినవ్ అని చూపిస్తోంది.

అతను తన ఫ్రెండ్ కాదు, ఎవరో తెలీదు, అందుకని వెంటనే జవాబివ్వాలా, వద్దా? అని ఆలోచించింది.

" హాయ్, మీరు మరోలా అనుకోకండి, నేను ఇక్కడే ఓస్లోలోనే ఉంటాను, ఊరికే పరిచయం చేసుకుందామని అడిగాను, మీ కిష్టం లేకపోతే పరవాలేదు" అని మరొక మెసేజ్.

" మీరు దాదాపు అరగంట క్రితం అనుకుంటాను ' అందరూ ఫామిలీస్ తోనూ, ఫ్రెండ్స్ తోనూ సరదాగా, హాయిగా ఉన్నారు ఈ సెలవుల్లో, నేనేమో ఈ చలిలో ఓస్లోలో ఒక్కదాన్నీ, బోర్ కొట్టి చస్తున్నాను, ఈ చలికీ, ఒంటరితనానికీ పిచ్చేక్కేలా ఉంది " అని స్టేటస్ పెట్టారు కదా, అందుకనే రాస్తున్నాను" అన్నాడు.

" ఏదో తిక్క పుట్టి రాసుకున్నానే అనుకో, ఇతనికేవిటింత ఇంటరెస్ట్? నాకు బోర్ కొడితే ఇతనికెందుకు? నన్నెవరైనా కొడితే ఇతనికెందుకు? తన ఫ్రెండ్ కాకుండానే అతను తన మెసేజ్ ఎలా చూశాడు? అయినా ఎవరినీ నమ్మడానికి లేదు ఈ రోజుల్లో" అనుకుంటూ ఉండగా

" ఇంకా ఆలోచిస్తున్నారు కదూ, సరే అయితే మీ ఇష్టం, మీరు నా ప్రొఫైల్ చూసి, మీకు ఓకే, నన్ను నమ్మొచ్చు అనుకుంటే మెసేజ్ పంపించండి, అంతలోపు నేను చిన్న పని కానిచ్చుకుని వస్తా, అదే వేడిగా కాఫీ చేసుకుని" అన్నాడు.

సాయంత్రం ఐదు కావస్తోంది. ఈ రోజు డిశంబర్ 23, లిటిల్ క్రిస్మస్ ఈవ్ అంటారు. అందరూ కుటుంబాలతో డిన్నర్ చేస్తారుట, అందుకని తను పనిచేసే క్లయింట్ ఆఫీస్ లో కొందరు రానే లేదు, వచ్చిన వారు తొందరగా వెళ్ళిపోయారు. తను కూడా చేసేదేమీ లేక పని పూర్తి కాగానే వచ్చేసింది. స్కూళ్ళకీ, గవర్నమెంట్ ఆఫీసులకీ అయితే సెలవులు నిన్నటినించే మొదలు, మళ్ళీ ఐదో తారీకునే పునర్దర్శనం.

టీ పెట్టుకుందామని అనుకుంది స్వాతి, పాల కేన్ ఖాళీ గా కనిపించింది. నీరసంగా గ్రీన్ టీ కలుపుకుని కంప్యూటర్ ముందు కూర్చుంది, యూట్యూబ్ లోకి వెళ్ళి తెలుగు సినిమాల్లోని కామెడీ సీన్లు పెట్టింది. వాటిని చూస్తూ మెల్లగా టీ చప్పరించసాగింది.

ఇంతలోకి అభినవ్ మెసేజ్ గురొచ్చి, యూట్యూబ్ ఆపి, అతని ప్రొఫైల్ చూడసాగింది. తనూ, భార్య కాబోలు స్విట్జర్లాండ్ లో తీయించుకున్న ఫోటో, ప్రొఫైల్ పిక్చర్. నలుగురు నడివయస్కులున్న కవర్ పేజీ ఫోటో, ఆ నలుగురు వాళ్ళిద్దరి తల్లితండ్రులై ఉండవచ్చని భావించింది. అతను పెట్టిన పోస్ట్ లు, ఆ మాటకొస్తే అతని పేజీలోనీ అన్ని విషయాలూ కూడా చాలా మాములుగా, బావున్నాయి. అతని భార్య పేరు ఆరతి, ఆమె తమిళియన్ అయి ఉండవచ్చు అనుకుంది, ఆమె తల్లితండ్రులని చూసి. ఆమె పేజీలోకి కూడా వెళ్ళి చూసింది, ఇద్దరూ మంచివాళ్ళల్లా కనిపించారు, మంచి చదువూ, అభిరుచులూ వగైరా, అక్కడ రాసినదంతా నిజం కావాలని రూలు లేదని తెలిసినా,' పరవాలేదు' అని మనసెందుకో గట్టిగా చెప్పడం వల్ల అతనికి మెసేజ్ పంపింది.

"హాయ్, నా పేరు స్వాతి, ఒక నెల క్రితం వచ్చాను ఇక్కడికి, మీతో ఇలా పరిచయం అవడం చాలా సంతోషం అని, మిమ్మల్నీ, ఆరతిని కలవాలని ఉంది " అంటూ

"థాంక్ యూ, ఇప్పటికికి కొంచం పరవాలేదు అనిపించిందన్నమాట, నా పేరు అభినవ్ జైన్,మాది రాజస్థాన్, నా భార్య ఆరతిది చెన్నై, మేమిద్దరమూ ఇక్కడికి ఒక ప్రాజెక్ట్ పనిమీద వచ్చాము, ఇంకో సంవత్సరం పట్టవచ్చు మా పని పూర్తి కావడానికి" అని తన ఫోన్ నెంబర్ ఇచ్చాడు.

ఎందుకో తెలియదు కానీ స్వాతికి కాస్త ఉత్సాహం వచ్చింది.

"మీరు ఇప్పుడేం చేస్తున్నారు? డిన్నర్కి కలవగలరా? నా దగ్గర కార్ ఉంది, ఆరతి, నేను, మా మదర్ ఇన్ లా మిమ్మల్ని పిక్ చేసుకోవడానికి వస్తాము" అన్నడు.

దాంతో చాలా ధైర్యం వచ్చింది స్వాతికి. హుషారుగా 'సరే', అని తనుండే చోటూ, ఎడ్రెస్ చెప్పి, తన ఫోన్ నంబర్ ఇచ్చింది.

" మరొక అరగంటలో వస్తాము" అని అభినవ్ చెప్పాడు.

ఆమె ఉత్సాహంగా టీ తాగి, త్వరగా తయారయ్యింది, స్నో బూట్లు వేసుకుంటూ ఉండగా ఫోన్ మోగింది, ఇప్పుడు ఆరతి మాట్లాడింది.

"హాయ్ స్వాతి, మేము మీ అపార్ట్మెంట్ దగ్గరలోనే ఉన్నాము, మీరు కిందకు వచ్చేస్తే కలుద్దాం, చలి బాగా ఉంది, జాగ్రత్త" అంటూ చెప్పింది.

చెవులను కప్పుతూ టోపీ పెట్టుకుని, మెడకు స్కార్ఫ్ కప్పుకుని చేతులకి గ్లవ్స్ వేసుకుని తలుపు తాళం వేసుకుని కిందకు బయలుదేరింది స్వాతి.

ఖాళీ గా ఉన్న రోడ్లమీద, కార్ లో అద్దం దగ్గర ఎర్రటి బట్టతో చిన్న దేవుడిపూజ చేసిన మూట లాంటిది కట్టి ఉన్న వారి కార్ ని గుర్తు పట్టడం స్వాతికి పెద్ద కష్టం కాలేదు.

"హాయ్" అంది తలుపు తీసిన ఆరతిని చూడగానే

"చలి, ముందు ఎక్కండి, తర్వాత మాట్లాడుకుందాం" అంది ఆరతి పొట్టమీద చెయ్యి ఉంచుకుంటూ. "అప్పుడు చూసిందామె వైపు, ఆరతి గర్భవతి, నెలలు నిండడం వల్ల కావచ్చు నున్నగా అందంగా మెరుస్తోందామె ముఖం, చామన చాయ, తీరుగా ఉన్న చిన్న ముక్కూ, చిన్న ఒంటి రవ్వ ముక్కుపుడక, తీర్చిదిద్దినట్టున్న కళ్ళు, 'చక్కగా ఉంది' అనుకోకుండా ఉండలేకపోయింది.

"హాయ్, నేనే అభినవ్" అన్నాడు అభినవ్ నవ్వుతూ, ఎత్తుగా అందంగా ఉన్నాడు అతను, జెల్ రాసి వెనక్కు దువ్విన జుట్టూ, నవ్వే చిన్న కళ్ళూ, సూదిలా ఉన్న ముక్కూ.

"'వీరిద్దరికీ పుట్టబోయే బిడ్డ చాలా అందంగా ఉంటుంది " అనుకుంది స్వాతి.

"తను మా మదర్, గౌరి " అంది ఆరతి వెనక సీట్ లో స్వాతి పక్కనే ఉన్న ఆవిడని చూపిస్తూ.

ఆవిడ కూడా ఆరతి ఇరవై ఏళ్ళ తర్వాత ఎలా ఉంటుందో అలా ఉన్నారు, చాలా పోలికలు ఇద్దరికీ.

"నమస్తే" అంది స్వాతి, మీ అమ్మలా లేరు, అక్కలా ఉన్నారు అంది చప్పున

"నమస్తే" అన్నారావిడ కూడా నవ్వుతూ.

"అమ్మ చెన్నై లో పద్మా శేషాద్రి స్కూల్ లో పని చేస్తారు, నాకోసమే వచ్చారు లీవ్ పెట్టి, మేమిద్దరమూ రెండు రోజుల్లో ఇండియా వెళతాము, మళ్ళీ డెలివరీ అయ్యాకా రెండు మూడు నెలలకి వస్తాను అంది ఆరతి.

"ఓ అవునా, ఇంతలో పరిచయమయి అంతలోనే వెళ్ళిపోతారా?" అంది స్వాతి అసంకల్పితంగానే.

"వెళ్ళేది నేనే, అభినవ్ ఇక్కడే ఉంటాడు, నేను కూడా మళ్ళీ వచ్చేస్తాను, వీలైనంత త్వరలో, మీరెన్ని రోజులుండాలి ఇక్కడ" అంటూ ప్రశ్నలు వేశింది ఆరతి. త్వరలోనే అందరూ కబుర్లలో పడ్డారు.

సిటీ సెంటర్ లోని ఒక రెస్టారెంట్ దగ్గర కార్ ఆపాడు, తను గబ గబా కార్ దిగి వచ్చి ఆరతి వైపు డోర్ తీసి ఆమెని జాగ్రత్తగా చెయ్యి పట్టుకుని దింపాడు. ఈ సారి చలి చాలా ఎక్కువగా ఉండడం వల్ల, ఆరతిని వాళ్ళ అమ్మగారితో పాటు చెన్నై పంపిద్దామని ప్లాన్ చేశాడు. ఆమె విమాన ప్రయాణానికి వీలుగా డాక్టర్ దగ్గరనించి సర్టిఫికెట్ ఏర్పాటుచేశాడు.

" ఈరోజుని లిటిల్ క్రిస్మస్ ఈవ్ అంటారు, ఈ రెస్టారెంట్ లో చక్కెరా, దాల్చిన చెక్కా, బాదం పలుకు వేసి వండిన బియ్యపు పరమాణ్ణం లాంటి క్రిస్మస్ స్పెషల్ వంటకం దొరుకుతుంది, దాన్ని తింటున్నపుడు అందులో బాదం పప్పు ఎవరికి వస్తే వారిని చాలా అదృష్టవంతులుగా భావించి వారికి ఒక చిన్న మాజాపాన్ పిగ్ ( బిస్కట్ లాంటి పదార్ధం తో చేసిన చిన్న పిగ్ ఆకారంలో ఉన్న బొమ్మ) బహుమతి ఇస్తారు, చూద్దాం, మన నలుగురిలో ఎవరికి వస్తుందో ఆ బాదం పప్పు "అన్నాడు అభినవ్.

నాలుగు చెంచాల అన్నం తినగానే ఆరతికి వచ్చింది ఆ బాదం పలుకు, అది చూసి హోటల్ వారు చిన్న బిస్కెట్ తో చేసిన పిగ్ బొమ్మని ఇచ్చి అందరూ చప్పట్లు కొట్టారు.

"నిజంగానే మీరు లక్కీ," అంది స్వాతి .

"అవును లేకపోతే అభినవ్ దొరికేవాడా నాకు?" అంది ఆరతి సంతోషంగా భర్త వైపు చూస్తూ. వాళ్ళ అమ్మ గారు కూడా 'నిజమే ఆరతీ' అంటూ ఆమె తల నిమిరారు. వాళ్ళిద్దరినీ చూస్తూ ఉంటే ఎంతో ముచ్చటగా ఉంది స్వాతికి.

" క్రిస్మస్ రోజున ఆంటీనీ, అరతినీ ఫ్లైట్ ఎక్కించాలి, మీరు కూడా వస్తారా ఎయిర్ పోర్ట్ కి? వేరే పని ఏమీ లేకపోతే? నలభైఐదూ– యాభై కిలోమీటర్లుంటుంది" అన్నాడు అభినవ్.

"ష్యూర్" అంది వెంటనే, కానీ మళ్ళీ ఆరతి ఏమనుకుంటుందో అని చప్పున ఆమె వైపు చూసి "ఇక్కడికొచ్చినప్పటినించీ ఆఫీస్ లోనే ఎక్కువ పని లేదు, ఇంక మిగతా టైమంతా ఖాళీనే, తప్పకుండా వస్తాను" అంది.

"గ్రేట్, వచ్చేటప్పుడు కూడా నీకు మంచి కంపెనీ ఉంటుంది, స్వాతికి కూడా బోర్ కొట్టదు" అంది ఆరతి సంతోషంగా.

"కొత్తవారితో ఇంత సరదాగా, ఫ్రెండ్లీగా ఎలా ఉండగలుగుతున్నారో కదా వీరు, అదే తనైతే ఎంత అనుమానించింది? " అనుకోకుండా ఉండలేకపోయింది.

భోజనం అయ్యేసరికి దాదాపుగా ఎనిమిది గంటలయింది.

"రేపు క్రిస్మస్ ఈవ్, అందరూ సాధారణంగా ఇంట్లోనే భోజనం చేస్తారు, రేపు మీరు మా ఇంటికొస్తున్నారు, అభినవ్ మధ్యాహ్నం వచ్చి మిమ్మల్ని తీసుకొస్తాడు, రాత్రి డిన్నర్ అయ్యాకా మళ్ళీ దింపేస్తాము, నేను ఎలాగూ క్రిస్మస్ రోజు వెళతాను కదా "అంది ఆరతి.

" సరే " అంది స్వాతి, ఆరోజు పొద్దున్నే వీలు చూసుకుని అతి కష్టం మీద పదకొండు గంటలకి బయటకి వెళ్ళి వాళ్ళ ముగ్గురికీ చిన్న, చిన్న బహుమతులు కొంది.

ఆ రోజు రాత్రి ఆరతి వాళ్ళ అమ్మ గారు వండిన తమిళ సాంప్రదాయ భోజనం ఎంతో నచ్చింది స్వాతికి, తన తల్లితండ్రులు చెన్నై లో ఉన్న సంగతి చెప్పింది. ఆవిడ వెంటనే తాము వెళ్ళేసరికి వాళ్ళు అక్కడే ఉంటే తప్పకుండా కలుస్తామని చెప్పారు. ఆ రోజు రాత్రి వారు అక్కడే ఉండి పొమ్మన్నారు, మొదట కొంత తటపటాయించినా వాళ్ళ అమ్మగారు కూడా మరీ మరీ చెప్పడం వల్ల బలవంతాన ఒప్పుకుంది. వాళ్ళదీ తన ఇంటిలాగే అక్కడ రెండు రూముల అపార్ట్మెంట్ గా పిలవబడే సింగిల్ బెడ్రూం ఫ్లాట్. ఆరతి అమ్మగారు, తను హాల్ లో పడుకున్నారు. రాత్రి ఆవిడ తన స్కూల్ విశేషాలు అవీ చెప్తూ ఉంటే అచ్చు అమ్మ దగ్గరే ఉన్నట్టనిపించింది స్వాతికి. " ఈ అమ్మలందరూ ఒకే స్కూల్ కి వెళతారేమో? లేకపోతే ఒకేలా ఎలా మాట్లాడతారో? రేపు ఆరతి కూడా ఇలాగే ఉంటుందా?" అనుకుంటే నవ్వు వచ్చింది స్వాతికి.

మర్నాడు చాలా హడావిడిగా గడిచిపోయింది. ఆరతి అమ్మగారు అప్పటికి మూడు రోజులనించీ అల్లుడికోసం రకరకాల పదార్థాలు చేసి ఫ్రిజ్ లో చిన్న, చిన్న డబ్బాలలో పెడుతూనే ఉన్నారు. నలుగురూ కలిసి కార్ లో బయలుదేరారు ఎయిర్ పోర్ట్ కి.

"నాకస్సలు వెళ్ళాలని లేదు తెల్సా? అభినవ్ ఒక్కడే ఉండలేడు నేను లేకుండా, మేము ఇక్కడికొచ్చాకా ఫ్రెండ్స్ అయినవాళ్ళు విక్రం, స్వప్న, కీర్తి, రాము. నలుగురూ కలిసి పారిస్, ఇటలీ చూడటానికి వెళ్ళారు. నేను ఇండియా వెళదామని నిర్ణయించుకున్నాను కనక వెళ్ళలేదు, అభి ని వెళ్ళమంటే ఒక్కడినీ వెళ్ళను అన్నాడు. టికెట్లు ముందుగానే బుక్ చేయించునందువల్ల మేము ఇప్పుడే వెళ్ళక తప్పడం లేదు, లేదంటే ఈ హాలిడేస్ లో అభిని ఒక్కడిని వదిలేసి వెళ్ళేదాన్నే కాదు" అంది ఆరతి.

" అసలు ఈ దేశంలో ఒంటరిగా ఉండడమే ఎంత కష్టమో తనకి తెలిసినంతగా మరెవరికీ తెలీదు, ఇద్దరమూ ఒకసారి రాలేదు ఇక్కడికి, మొదట తనే వచ్చాడు, రెండేళ్ళవుతోందేమో. ఆన్ సైట్ అనగానే వెంటనే ఒప్పేసుకున్నాడు, తనకి మొదటినించీ వివిధ ప్రదేశాలు చూడాలంటే ఇష్టం, డబ్బు మీద మోజు కాదు తననిక్కడికి తెచ్చింది. ఇక్కడ ఉండి యూరోప్ అంతా చూసొద్దాం అన్నాడు, నాకూ చాలా సరదాగా అనిపించి వెంటనే సరే అన్నాను, ఎంత నెట్ లోనూ, పుస్తకాలలోనూ చదివినా సరే మనం ప్రత్యక్షం గా చూసినది వేరు కదా. జీతం బావుంది కదా అనుకున్నాము తప్ప ఇక్కడింత ఖరీదులుంటాయి అని గానీ, ఇంత విపరీతమైన చలి ఉంటుందని గానీ మేమసలు ఊహించనేలేదు" అంది నవ్వుతూ.

తన కథనే తనకెవరో చెప్తున్నట్టుగా అనిపించింది స్వాతికి.

"నాకు కూడా అంతే, ఆన్ సైట్ మీద ఎంతో ఆశ. అది ఇలా తీరుతోంది, డబ్బులు మిగులుతాయి అనుకున్నాను, ప్రతీ వారం మా మేనేజర్ దగ్గరకి వెళ్ళి గొడవచేసేదాన్ని. అతన్ని అంతలా విసిగించినందుకు నా మీదిలా పగ తీర్చుకున్నాడు అనుకుంటున్నాను గత పది రోజులుగా, మీరు పరిచయం అవకపోయి ఉంటే నాకు నిజంగా పిచ్చెక్కేదేమో కూడా మరి కొన్ని రోజుల్లో" అంది తను కూడా చిరునవ్వుతో.

ఆరతి నవ్వింది, "ఐ కెన్ అండర్ స్టాండ్, ఇక్కడికొచ్చిన కొత్తలో నాకు అలాగే ఉండేది, అభి కోసమని ఇండియాలో చేస్తున్న ఉద్యోగం వదిలేసి వచ్చానేమో, రోజంతా ఇంట్లో ఒక్కదాన్నీ కూర్చోవాలంటే ఎంత బోర్ కొట్టేదో? తనెప్పుడొస్తాడా?" అని ఎదురు చూసేదాన్ని, అని ఆరతి అంటుండగానే,

"నువ్వు రాక ముందు నా సంగతి ఆలోచించమ్మాయీ, ఏడుపొక్కటే తక్కువగా ఉండేది నాకు, అన్నాడు అభినవ్ నవ్వుతూ.

" ఇక్కడకి వచ్చి న తర్వాత నాకు ఉద్యోగం దొరకడానికి కొంత టైం పట్టింది, అది దొరికాక కొంత స్థిమిత పడ్డాం, అనుకుంటే ఇప్పుడిది, అంది తన పొట్టవైపు చూపించి నవ్వింది, అదృష్టవశాత్తూ ఇక్కడ ఆడవారికి వసతులు బాగానే ఉన్నాయి కనక నాకు బాగా లీవ్ దొరికింది. ఇందాకా చెప్పిన స్నేహితులు పరిచయం అయ్యాకా మాకు కాస్త ఒంటరితనం తగ్గింది, చెప్పాను కదా, వాళ్ళు ప్రస్తుతం వెకేషన్ లో ఉన్నారు, మంచివాళ్ళు, , తిరిగి వచ్చాకా వారిని అభి మీకు పరిచయం చేస్తాడు, ఇట్ ఈజ్ ఫన్ టూ హేవ్ ఏ గ్రూప్ అంది" నవ్వుతూ.

"నిజమే, నాకు నిన్నటివరకూ ఉన్న ఒంటరితనం మీ పరిచయంతో దూరమైనట్టనిపిస్తోంది, అరిస్టాటిల్ ఊరికే చెప్పలేదు కదా "మనిషి సంఘ జీవి" అని అంది స్వాతి నవ్వుతూ.

" ఇంతకీ నాదొక సందేహం, నేనెక్కడో ఫేస్ బుక్ లో పెట్టిన మెసేజ్ చూసి నన్ను కనుక్కున్నారు అభినవ్, ఎలా సాధ్యం అయింది? అంది ఉత్సుకతతో.

"అదా, చాలా సింపుల్, అభి ఫేస్ బుక్ నుపయోగించి ఒక చిన్న ప్రోగ్రాం ( యాప్)రాశాను, అదే మనల్ని కనెక్ట్ చేసింది, దానిపేరు ఫేస్బుక్ కనెక్ట్ " అన్నాడు అభినవ్.

"మీరు ఇక్కడికి రాగానే "ఓస్లో లో ఇండియన్స్" అన్న గ్రూప్ లోకి ఫేస్ బుక్ ద్వారా నమోదు చేసుకుని ఉంటారు కదా?" అంది ఆరతి.

" అవును, ఇక్కడకి వచ్చిన రెండు రోజుల్లోనే నేను చేసిన మొదటి పని అది, అలా అయినా ఎవరైనా తెలుస్తారని అలా అనుకున్నాను" అంది స్వాతి.

" ఆ గ్రూప్ నిర్వహించేది అభినే. కొత్తగా వచ్చిన వారికి సహాయపడడం కోసమే తను అది క్రియేట్ చేశాడు, దానివల్ల ఊ ఊరిలో ఉన్న ఇండియెన్స్ ని కలుసుకోగలుగుతామని అతని ఆశ, చాలా మంది సభ్యులయ్యారు, వారివల్ల మాకు ఇక్కడ ఎంతమంది భారతీయులున్నారు? ఇండియన్ రెస్టారెంటులున్నాయా? మన మసాలాలూ అవి ఎక్కడ దొరుకుతాయి? ఎప్పుడైనా అందరూ కలుస్తారా? లాంటి చాలా విషయాలు తెలిసాయి. ఇప్పుడు దానిని ఫేస్ బుక్ తో అనుసంధానించాడు" అంది ఆరతి

" అవును, ఫేస్ బుక్ కనెక్ట్ అన్న దానితో అది సాధ్యపడింది, మీరు రకరకాల వెబ్ పత్రికలలో కామెంటులు పెడితే ఫేస్ బుక్ కి ఎలా కనెక్ట్ అవుతాయో ఇది కూడా అంతే," అన్నాడు అభి కూడా.

"ఏముంది చిన్నారీ? దాంట్లో, ఊరికే పిల్లలందరికీ గంటలు గంటలు కంప్యూటర్ల ముందు కూర్చుని ఫేస్ బుక్కులూ, అవీ అంటూ కాలం గడిపేయడం ఫేషన్ అయిపోయింది, దానివల్ల ఎంత హాని జరుగుతోందో తెలియడం లేదు మీకు, ఎన్ని కథలు చదువుతున్నాం? టీ. వీ లలో చూస్తున్నాం, అయినా ఈ పిచ్చి తగ్గడం లేదు, అందరూ ముఖ్యంగా వయసులో ఉన్న ఆడపిల్లలు ఎంత జాగ్రత్తగా ఉండాలి? ఊరికే ఫోటోలు అవీ పెట్టద్దు, ఎవరో తెలియని వారితో మాట్లాడద్దు " అమ్మ ఎప్పుడూ అనే మాటలు గుర్తొచ్చాయి.

" ఒక్కర్తీ ఉంది అని తన కూతురి ఉనికి కనిపెట్టి తనకింత సహాయం చేస్తున్న వీళ్ళనిలా చూస్తే ఏమంటుందో అమ్మ? వీరితో ముఖపరిచయాలకి దారితీసి, అది చక్కని స్నేహబంధానికి దారితీస్తుంది అన్ననమ్మకానికి తెరతీస్తున్నదీ, ఆ ముఖ పుస్తకమేనని అమ్మకి తెలిస్తే ఎలా స్పందిస్తుందో చూడాలి". అనుకుంది అనుకుంది చిరునవ్వుతో,

'క్రిస్టియన్ నోం' (Christian gnoam) లేదా 'యూలినిసెన్స్' ( Julenissens )అని పిలుస్తారు ఇక్కడ 'శాంటా క్లాస్ ' ని. ప్రపంచవ్యాప్తంగా రకరకాల పేర్లతో పిలుస్తారుట శాంటా క్లాస్ ని కానీ, పిల్లలందరూ అతనొచ్చి కానుకలు ఇస్తారని నమ్ముతారు. అలా శాంటా క్లాస్ ఇచ్చిన బహుమతిలా కనిపించింది వీరి పరిచయం తనకి అనుకుంది.

●●●

Click here to share your comments on this story